# మడిబట్ట

పిండి విసురుతున్న చెల్లాయ్యమ్మ "నేనెవర్ని?" అని ప్రశ్నించుకుంది.

పదిహేనేళ్లుంటాయి - చెల్లాయ్యమ్మకి కాదు - చెల్లాయ్యమ్మ ప్రశ్నకి. పదిహేనేళ్లాయి ప్రయత్నిస్తున్నాది - తనకి కలిగిన సందేహానికి సమాధానం చెప్పుకుందామనీ. దశాసరి తిరగలి దిమ్మలు తిరుగుతూ తిరుగుతూ ఈ దీర్ఘకాలంలో సగానికి సగం అరిగిపోయేయి. కాని చెల్లాయ్యమ్మ బుర్రలో గిరగిరా తిరుగుతున్న ప్రశ్న, 'నేనెవర్ని?' అన్న ప్రశ్నకి తను 'ఫలానా' అని జవాబు చెప్పుకోలేకపోతున్నది.

"నేనెవర్ని?" - కళ్లు చెమర్చ్యా దుఃఖం వచ్చింది చెల్లాయ్యమ్మకి.

కన్నెపొర చెరగకపోయినా కన్నెపిల్ల మాత్రం కాదు చెల్లాయ్యమ్మ.

మరి వివాహితా? - కాదంటే ధర్మశాస్త్రాలు కర్రుచ్చుకుంటాయి గనక 'ఔను' అనాలి. కాని మొగుడుతో ఒక్క 'నిద్ర'న్నా చెయ్యని తను ఫలానా మొగుడుకి పెళ్లాన్నని ఎలా సమాధానపరుచుకోగల్దు?

విధంతువా? 'ఔను' అండానికి వీల్లేకుండా మెళ్లో రొమ్ములమీద తళతళా మెరుస్తూ తాళిబొట్టు వేళ్లాడుతున్నాది.

మరి తానెవరు? - పదిహేనేళ్ల కిందట ఒకనాడు పిండి విసురుతుంటే చెల్లాయ్యమ్మకి తట్టిందీ ప్రశ్న. అప్పటికి కొద్ది నెలల క్రితంనుంచీ 'ఆలోచించుకోవడం' నేర్చుకున్న చెల్లాయ్యమ్మ ఆలోచనలు కొన్ని నాలుగక్షరాల ప్రశ్నగా రూపొందేయి. అక్షరాలు నాలుగే అయినా చిన్న ప్రశ్న కాదు - చాలా చిక్కు ప్రశ్న.

ఈ ప్రశ్న పెద్దదై పదిహేనేళ్లదయింది; చెల్లాయ్యమ్మ యౌవ్వనంలోంచి కౌమారంలో అడుగుపెట్టింది.

కళ్లముందు కాలం పరిగెత్తిపోతున్నాది- కళ్లు చెమర్చ్యా చెల్లాయ్యమ్మకి దుఃఖం పొర్లుకొస్తున్నది.

'ఫలానా' అని సంఘం తనకో ముద్ర వెయ్యకపోవడానికి తను చేసిన అపరాధం ఏమిటి? నలుగురూ పుట్టినట్టే తనూ ఓ అమ్మకి పుట్టింది. నలుగుర్లాగే తనూ పెరిగింది. అందరాడపిల్లల్లాగే తనూ పెళ్ళాడింది. ఐతే ఇక్కడే లోకరివాజు తనపట్ల ఎదురుతిరిగిందని తెలుసుకోలేకపోతున్నది చెల్లాయ్యమ్మ.

కొందరికి పాపభీతిలావు. అలాంటివాళ్లు 'ఫలానా పనిచెయ్యడం మహాపాపం' అని నమ్మితే ఇహ అపని - అది తమ జీవితాల్ని చక్కబెట్టేదైనా సరే - ఛస్తే చెయ్యరు. కావలిస్తే తర్వాత జీవితాంతమూ

## భాగవతుల రామారావు

'పాపభీతితో చేజిక్కిన అవకాశాన్ని జారవిడుచుకున్నామే!' అని లోలోపల కుళ్లిపోతుంటారు. వీళ్ళ ధార్మికత్వం నిజానికి పచ్చి పిరికితనం.

చెల్లాయ్యమ్మ అచ్చంగా ఇలాంటి పిరికిగుండెల ధార్మికుల జాబితాలోకి చేరిందే. ఏళ్లతరబడి కళ్లు కాయలు కాచి [illegible]లాగ కాచుక్కూచుంటే కొసకి రాకరాక ఒచ్చిన అవకాశాన్ని చేజేతులా ఒదులుకుంది.

చెల్లాయ్యమ్మ కిప్పుడు వయస్సు పరిదాపు మూడుపదులు నిన్నో మొన్నో చారబడుంటాయి. అయినా అరుగూ తరుగూ ఎరగని 'పరువం' చెల్లాయ్యమ్మ విగ్రహానికి మెరుగులు దిద్దింది.

చెల్లాయ్యమ్మకి పదోయేట - ఇరవయ్యేళ్ల కిందట - సలక్షణంగా, సంప్రదాయానుసారం పెళ్ళయింది. అంతకుముందు జ్ఞానం ఒచ్చిం తర్వాత ఒకటి రెండు పెళ్ళిళ్లు కళ్ళారా చూసిందేమో, తనకి పెళ్లనగానే 'బలే! బలే!' అనుకుంది చెల్లాయ్యమ్మ. పక్కింటి చిట్టిపిల్లతో "ఒసేయ్! నాకు పెళ్ళటా! ఊరూరు!" అని చెప్పి దాన్ని ఊరించింది కూడా. పెళ్ళంటే ఎంత సరదాగా ఉంటుంది! బేండుమేళం...కొత్త బట్టలు...పిండివంటలు..పల్లకీలో అంచక్కా కూచుని హాయిగా బేండుమేళంతో ఊరేగుతుంటే ఎంత సరదాగా ఉంటుంది!?

పెళ్ళికొడుక్కి మహాఉంటే పన్నెండేళ్లుండొచ్చు. చాలా సందడిగానే జరిగింది పెళ్ళి. ఒక్కగానొక్క కూతురు పెళ్ళి. కళ్ళారా చూసుకుందికి ఆయనకి ప్రాప్తం లేకపోయిందని అమ్మమాత్రం నాన్నని తల్చుకుని కాసేపు కన్నీరు పెట్టుకుంది.

ఊరేగింపునాటి రాత్రి బలే గమ్మత్తు జరిగింది. పదోగంట దాటేసరికి నిద్దర కాచుకోలేకపోయింది చెల్లాయ్యమ్మ. నిద్దర్లో జోగిపోయి పెళ్లికొడుకుమీద పడ్డాది. అప్పటికే ఎంతసేపట్నుంచో కూచునే కునికేస్తున్న పెళ్లికొడుకు కంటున్న కల చెదిరిపోగా చిరాకెత్తి, మీదపడ్డ పెళ్లికూతుర్ని మెడపట్టుకు ఒక్కతోపు తోసేడు వెనక్కి. ఆతోపుకి చెల్లాయ్యమ్మ తల పల్లకీ గోడకి రఠీమని గుద్దుకుని బొణిపి కట్టింది. నిద్రమత్తు ఒదిలిపోయి, తగిలిన దెబ్బకి అగ్గిరుద్రురాలయింది చెల్లాయ్యమ్మ. నిద్దర్లో కాస్త మీద ఒరిగినంత మాత్రాన్న గోడకేసి బుర్ర కొడతాడా అన్న ఉక్రోషంతో తను పెళ్ళికొడుకు తొడమీద కసిదీరా 'సొంటిపిక్క' లాగింది. "అమ్మోయ్! నన్ను గిల్లేస్తున్నాదర్రోయ్!" అని బొబ్బలెత్తేడు పెళ్ళికొడుకు. పల్లకీ నిలబెట్టి పెద్దలు, ఇద్దరి ఫిర్యాదులూ విని, సంగతి సందర్భాలు తెలుసుకున్నాక 'ఫకాల్న' కడుపులు చెక్కలయ్యేట్టు నవ్వుకున్నారు. చెరో లడ్డుండా ఇచ్చి, ఇదర్నీ బుజ్జగించి సవారీ కదిలించేరు. ఊరేగింపు సాగిపోతుంటే 'తెలిసిందా నా తడాఖా?' అన్నట్టు చూసిందోమారు కుర్రాడివేపు. గోళ్లునాటి మండుతున్నాదేమో ఆ అబ్బాయి పాపం తొడ తడుముకుంటున్నాడు. పాకాలి


కేశముల సౌందర్యాభివృద్ధికి
కాశ్మీర్-కుసుం
ఇష్టమైన సూనెలో నానబెట్టుడు
సుగంధ చర్మరక్షణ మలామ్
సాంటలక్స్
దురద, గజ్జలు, కాళ్లు, మొటిమలకు
ప్రేమలీలా
ప్రసిద్ధమైన మైసూర్ ఊదువత్తులు
నంజనగూడు-పండ్లపొడి
ఫ్యాక్టరీ వారి
నమ్మకమైన 60 ఆయుర్వేద ఔషధములు.
ఏజంట్లు : యునైటెడ్ కంపెనీ,
54, బందరువీధి; మద్రాసు-1
బ్రాంచి : గాంధీనగర్. విజయవాడ-2.

# ★ మడిబట్ట ★

కింద రూపాయి కాసంత నల్లని పుట్టుమచ్చుంది.

పెళ్ళయిపోయింది.

పెళ్ళయేక ప్రతిబంధకాలు లేవనేమోయి చెల్లాయ్యమ్మకి. అమ్మ ఎక్కడికీ మునపట్లా తిరగనిచ్చేది కాదు. ఎటూ తిరక్కుండా, చిట్టిపిల్లతో ఏటొడ్డున పిచికగూళ్ళు కట్టుకోకుండా, కరణంగారి రాముంగాడితోనూ, ఎదురింటివాళ్ళ రత్తితోనూ పెండిల్లో కోతికొమ్మచ్చు లాడుకోకుండా 'ఎందుకొచ్చిన పెళ్ళి!' అని విసుక్కునేది చెల్లాయ్యమ్మ. తోట్లంటా, దొడ్లంటా ఇష్టం వచ్చినట్టు తిరిగితే మొగుడికి కోపం వస్తుందట! తనెలా తిరిగితే మొగుడుకేం? ఆ వుగ్రాణ్ని తనేం తిరగొద్దందా? వాళ్ళూళ్ళో ఆ అబ్బాయి తిరగడం మానేసేడేవిటి? అమ్మ కేమీ తెలీదూ!

ఇంటి కూచమ్మ బయిపోవలిసొచ్చినందుకు పెళ్ళానికి చాలా ఇబ్బందిగా ఉందని చెల్లాయ్యమ్మ మొగుడికి తెలిసుంటుంది. తన మూలంగా పెళ్ళానికి లేనిపోని ఇబ్బందులూ, ఇరకట్లూ ఎందుకని కాపొరాసు ఆ వుగ్రాడు తను అడ్డు తప్పుకున్నాడు. ఇంట్లోంచి రెండొందల రూపాయిలు సంగ్రహించి చక్కా ఎక్కడికో ఉడాయించేసేడో మంచిరోజున.

అమ్మ లబోదిబోమని గుండెలు బాదుకుంది కబురు తెలియగానే. చెల్లాయ్యమ్మకీ కళ్ళమ్మొయ్యా దుఃఖం వచ్చింది.– మొగుడు పరారయేడని కాదు – అమ్మ ఏడుస్తున్నాదని.

ఏళ్ళు గడిచిపోతున్నాయి. పారిపోయిన చెల్లాయ్యమ్మ మొగుడు తిరిగిరాలేదు. ఎక్కడున్నదీ ఆ చూకీ దొరకలేదు.

చెల్లాయ్యమ్మ పెద్దమనిషయిన్నాడు అమ్మ ఎంతో ఏడిచింది. ఈ శోకం తర్వాత తనకి 'ఆలోచించుకోవడం' తెలిసింది గనక, తన జీవితానికి ఎంత పెద్దదెబ్బ తగిలిందో అర్థం చేసుకుంది చెల్లాయ్యమ్మ.

తన నూరేళ్ళ కాపరానికి నీళ్ళుపోసేడు వుగ్ర మొగుడు. ఏ తప్పూ చెయ్యని తన కెందుకీ దండన? పెళ్ళిలో తెలిసో తెలీకో మొగుణ్ని గిల్లింది. అందుకనా తనకీ శిక్ష?

కళ్ళముందు కాలం జరిగిపోతున్నాది. ఏళ్ళు వెనక్కి పడుతున్న కొద్దీ క్రమేపీ మొగుడి మొహం మరుపుకొస్తున్నాది చెల్లాయ్యమ్మకి. ఎన్నేళ్ళకిందటో చూసిన మొహం, ఎన్నాళ్ళని జ్ఞాపకం ఉంటుంది? మొగుడంటే చెల్లాయ్యమ్మకిప్పుడు జ్ఞాపకం వచ్చేది, అతని మోకాలిమీది పుట్టుమచ్చ.

ఈ శోకిత కొన్ని నెల్లతర్వాత ఒక రోజున పిండి విసురుతుంటే చెల్లాయ్యమ్మకి తట్టింది 'నే నెవర్ని?' అన్న ప్రశ్న. ఆనాటినుంచీ అను నిత్యం ఈ ప్రశ్న వేధిస్తానేవుంది చెల్లాయ్యమ్మని. చచ్చేదాకా బ్రతకవలిసిన అమ్మాయి పదిహేనోఏట కళ్ళు విప్పి భవిష్యత్తు చూసుకుంటే కళ్ళకి అకాంతంగా ఓ పెద్ద ఎడారి కనిపించినప్పుడు, ఆ అమ్మాయి పరిస్థితి ఎలా ఉంటుంది? కాలికింది భూమి కంపిస్తుందా? హృదయంలో బడబాగ్ని భగభగమంటుందా? బుర్రలో విటంబాంబులు పేలుతాయా? ఏమో! ఏమేనా కావొచ్చు. మనిషి వుప్పలా కూలిపోవచ్చు. 'నే నెవర్ని?' అని ప్రశ్నించుకోవచ్చు. చెల్లాయ్యమ్మ అచ్చంగా అదేపని చేసింది. ఆమె వేసుకున్న ప్రశ్నకి జవాబు దొరకదు – ఆమె భవిష్యత్తు ఎడారి అయింది గనక.

పదహారు, పదిహేడు, ఇరవై, ఇరవైనాలుగు...తీయని కోరికలు ఊటలూరే వయస్సు దాటిపోతున్నాది వృధాగా.

ఆవేళ రోజూలాగే తెల్లారింది – బరువుగా, బాధగా. నిద్దర బద్ధకం తీరక పక్కమీద ఇటూ అటూ దొర్లుతున్నాది చెల్లాయ్యమ్మ. అమ్మ వీధిగడపలో ముగ్గుపెడుతున్నాది. అదే సమయంలో వీధివాకిట్లో రెండెడ్లబండీ ఆగింది. బండీలోంచి హాఠాత్తుగా దిగబడ్డ వియ్యపురాల్ని, వియ్యంకుణ్ని, మరో ముప్ఫయ్యేళ్ళ యువకుణ్ని చూసి అమ్మ తెల్లబోయింది. వియ్యపురాలు దిగుతూనే "కోడలేదీ? అబ్బాయొచ్చేడు!" అంది – 'పోగొట్టుకున్న పెన్నిధిని పట్టుగొచ్చేంసుమండీ!' అన్నట్టు సంతోషాన్ని తొణికిస్తూ.

"ఆఁ! అల్లుడొచ్చేడా?" అమ్మకి ఆనందంలో గుండెలాగిపోయింటాయ్. ఎంతకమ్మని వార్త!

"మీ అత్తగార్రా అబ్బాయ్. కాళ్ళకి మొక్కు. అలా చూస్తావేం?" అందత్తగారు, ఆ పాతికేళ్ళ యువకుణ్ని ముందుకి తోస్తూ. అతగాడు అమ్మపాదాల్ని కళ్ళకద్దుకుని 'దీర్ఘాయురస్తు' అని అమ్మ దీవెనలందుకున్నాడు. ఈ తతంగం అంతా అప్పుడే చెల్లాయ్యమ్మ కిటికీరెక్కలు ఓరగా వేసుంచి చూస్తున్నాది.

తన మొగుడొచ్చేడు!

ఒక్కమాటు భయం, సంతోషం, కలవరా, సిగ్గూ పుట్టుకొచ్చేయి తట్టుకోలేని భావప్రదేశంలో కొట్టుకుపోయింది.

ఒళ్ళల్లా కళ్ళుచేసుకుని, ఇన్నేళ్ళతర్వాత ఊడిపడ్డ—తప్పు! తప్పు! కటాక్షించిన – మొగుణ్ణి తలుపువారగా, ఓరగా చూచింది. అంచక్కా, అచ్చంగా దొర్లమనిషిలా ఉన్నాడు. (అలా కనిపించేడు చెల్లాయ్యమ్మ కళ్ళకి!) తెల్లని మొహం–నల్లద్దాల కళ్ళజోడూ. ఎటు చూస్తున్నదీ తెలీకుండా ఎటో చూస్తున్నాడు. ఎందుకోసం? ఎవరికోసం? తన తెలివి మండినట్లుంది. తన కోసం కాపోతే ఇంకెవరికోసం? అబ్బ


క్షీరబల
(101 మార్లు ఆవర్తితము చేయబడినది)
ప్రఖ్యాతమైన యీ మలబార్ ఔషధము అన్ని రకముల పక్షవాతము, కీళ్ల వాతములకు, యింకా యిటువంటి రకముల వ్యాధులకు ఉత్తమ చికిత్స. ఈ వ్యాధుల కిది పొటిలేనిది.
జబ్బు యొక్క లక్షణములను బట్టి, దీనిని కడుపులోకి, పైపూతకు కూడా వాడవచ్చును. నస్యముగా గూడా వాడవచ్చును.
ఆయుర్వేదాచార్య ఎస్. మాధవ మేనన్, A.M.A.C's
మలబార్ ఆయుర్వేదిక్ స్టోర్సు
107-108, బ్రాడ్వే
మదరాసు-1
ఫోన్: 4116
సలహాలనిచ్చు వైద్యులు: Dr. ఎస్. శంకున్ని మేనన్ L. I. M

ఎంత మంచివారూ! చెల్లాయ్యమ్మకి తెలీకుండానే బహువచన ప్రయోగం ఒచ్చేసింది! ఇంచక్కటి మొగుణ్ణి గిల్లింది. ఛీ! ఎలా చేతులొచ్చాయో! అందుకనే బుద్ధొచ్చేలాగ మాబాగా ఏడిపించేరు. పెళ్ళిలో నలుగుర్లోనూ పెళ్ళాం గిల్లితే ఊరుకుంటారా?...కాని పెళ్ళినాటి ఆ పెళ్ళికొడుకు కుర్రాడు — దుమ్మర్ధగుండులా మొహం వాడూనూ!—మంచివాడు కాడు. ఈయనే ఐతే గిల్లుతుందేవిటి? ఈయనెంత రీవిగా, ఎంత నాజూగ్గా ఉన్నారు!

గుండెలకి చేతులు అదుముకుంది.

అమ్మ అల్లుణ్ని సాదరంగా చూసి “ఎంతలా మారిపోయావోయ్? పోల్తే పట్టలేక పోయాను!” అంది సంబరపడుతూ, ఇరుగమ్మ, పొరుగమ్మల్ని పిల్చి అల్లుణ్ని చూపించిందమ్మ.

కాలం కలిసొస్తే మోడు చిగురిస్తుంది!

కళ్ళముందు కూతురూ అల్లుడూ కాపరం చెయ్యడం చూసి ఆనందిద్దామన్న అమ్మ ముచ్చట నెరవేరే తరుణం ఇప్పటికొచ్చింది. శుభముహూర్తం చూసి ఇద్దర్నీ గదిలోకి పంపించేరు— పెళ్ళయిన పద్దెనిమి దేళ్ళకి మొగుడూ పెళ్ళాం మొదటిసారి ఎదురెదురుగా, ఏకాంతంగా!

సొంటిపిక్కలాగిన మొగుడిదగ్గిర తనకంత సిగ్గెందుకనో? అయనే చెయ్యిపట్టుకు మంచంమీద కూచోబెట్టుకున్నారు. తనకి ఒళ్ళంతా అదోలా ఐపోయింది. మీరాయుండతీసి తన నోట్లో కుక్కారు.

‘ఇలలోన వేదంబు తలపోయ నేల?’ అనుకుని స్వర్గానికి ఎచ్చిన వేస్తున్న మొగుడు—పాన్పుమీంచి వెల్లకిలా కింద పడ్డాడు—తను అన్న తోపుకి.

ఒక్క అదటున తలుపు తీయించుకు బయటికొచ్చి, “అతన్నా మొగుడు కాడు!” అంటూ అమ్మని కౌగలించుకుని బావురుమంది చెల్లాయ్యమ్మ.

అమ్మ కొరడుబారిపోయింది. అత్తమామలు కలో కల్లో తెలీని మగతలోపడి ఒళ్ళు గిల్లుకున్నారు.

అమ్మలక్కలు నలుగురూ తలోవిధంగా గుసగుసలు మొదలెట్టేరు:

“కుర్రాణ్ని చూడగానే నా కనుమానం వేసిందిస్మండీ అయినా నాకెందుకు— అని ఊరుకున్నాను.”

“ఎవడో ఒచ్చి నాటకం ఆడుతున్నాడని నేను మొదటే పసిగట్టేను. కాని వాళ్ళూ వాళ్ళూ ఇష్టపడ్డప్పుడు మధ్య కాండూరి లక్ష్మీంపతిలా నేను కాదనడం దేనికని నోరుమూసు గూరుకున్నాను. చెప్పకేం!”

“ఏ పద్దెనిమిదేళ్ళ కిందటో పారిపోయిన గుంటకళ్ళగట్టు ఇహా వచ్చేదేవిటి? అంచేత అబద్ధంవా? శుబద్ధంవా? పిల్లకాపరం నిలబెడదామని ఉభయులూ లాలోచీ పడుంటారు. సమయానికి గుంటపాప కథ అడ్డం తిప్పింది.”

“గడుసుది సమయానికి కొనుకుంది కాని ...అవ్వ!”—.

మామగారు ఆయన్ని బయిటికి తీసు



# ★ మడిబట్ట ★

తెచ్చి "ఏమిట్రా అబ్బాయ్? నువ్వు దాని మొగుడువి కాదంటోందేమిటి?" అనడిగేరు. చచ్చు ప్రశ్న - 'నేను నీ నాన్నని కాదూ?' అనడగలేదు నయం.

"మీరుకూడా అనేయండి - నేను మీ అబ్బాయిని కానని. వచ్చిందారినే చక్కా పోతాను" కస్సుమన్నాడతగాడు.

మామగారు వెనక్కి తగ్గేరు.

చెల్లాయ్యమ్మ వేపు తిరిగి "వీడు నీ మొగుడు కాడని నువ్వెలా చెప్పగలవ్?" అని ప్రశ్నించేరు. అతని ప్రశ్నలో 'ఇతగాడు మా కొడుకని మేం నమ్మినప్పుడు, నీ మొగుడని నువ్వు నమ్మలేవూ?' అన్న ధోరణి ధ్వనించింది.

చెల్లాయ్యమ్మకి ఒళ్లుమండింది - "నేను నా మొగుడెవరో పోల్చుకోలేను కాబట్టి, ఎవర్నో తీసుకొచ్చి నా మొగుడంటారన్న మాట?" ఎదురు ప్రశ్న వేసింది.

"బాగుందమ్మాయ్. మహా బాగుంది! మా అబ్బాయిని మాకు తెలీదూ?"

"నా మొగుణ్ని నాకేనా తెలీదు?"

"నీకేం తెలుసూ? నాటికి నేడు చూసేవు!" తెలివిగా ప్రశ్నించేడాయన.

"నాడు చూసిన ఆనమాళ్లు నేడు లేవు కాబట్టేనూ!"

"ఆనమాళ్లా! ఆనమాళ్లేమిటి? లేకపోవడం ఏమిటి?" ప్రశ్నిస్తున్నది చెల్లాయ్యమ్మనే ఐనా ప్రశ్నార్థకంగా కొడుకు వేపు చూసేడాయన.

"పెళ్ళినాడు చూశాను. మా కాలిమీద పుట్టుమచ్చుండాలి..."

చుట్టూ మూగిన చిన్నా పెద్దా మొహామొహాలు చూసుకున్నారు.

తర్వాత చాలాసేపు తర్జన భర్జన జరిగింది. చివరికి రాత్రికి రాత్రే బండెక్కి తిరుగుమొహం పట్టేరు అత్తమామలు 'కొడుకు'ని వెంటబెట్టుకుని.

మామగారు మాత్రం రాయబారాలు నలుపుతూనే ఉన్నారు. కోడల్ని కాపరానికి పంపించమని. ఒకటి రెండుమార్లు 'ఆయన' చేతకూడా రాయించేరు ఉత్తరాలు- కాని చెల్లాయ్యమ్మ ససేమిరా 'ఆయన' తన మొగుడు కాడనేసింది.

ఊళ్లో మాత్రం చెల్లాయ్యమ్మ నిప్పుతునక లాంటి మనిషని యోగ్యతాపత్రం సంపాదించుకుంది.

చూస్తుండగానే కాలం గడిచిపోతున్నాది. వచ్చిన మొగుణ్ని చెల్లాయమ్మ తగిలేసింది. రాని మొగుడుకోసం వస్తాడని ఎదురుచూస్తున్నాది. ఈడు ముదురుతున్న చెల్లాయ్యమ్మ ఇల్లాలూ కాదు, కన్యా కాదు. రెంటికీ చెడింది. 'ఎక్కడవేసిన గొంగళీ అక్కడే' అన్నట్టు మళ్ళీ కథ మొదటికొచ్చింది—'నేనెవర్ని?' అని పిండి విసురుతూ ప్రశ్నించుకున్న చెల్లాయ్యమ్మ తను 'ఫలానా' అని సమాధానం చెప్పుకోలేకపోతున్నాది.

'నిప్పుతునక' అని తన నిగ్రహశక్తిని మెచ్చుకున్నవాళ్లే రానురాను రంగు ఫిరాయించేరు. 'మొగుణ్ని ఒదిలించుకుందికి ఈ ఎత్తు వేసింది. చాటుమాటున ఎవణ్నో పెట్టుకు కులుకుతున్నాది!' అని గుసగుసలాడుకోవడం మొదలెట్టేరు ఊళ్లోవాళ్లంతా. ఈ అపనింద చెవినిపడ్డాక చెల్లాయ్యమ్మ మనసు ఉసూరుమంది. 'నిజాయితీకున్న విలువ ఇంతేనా?' అని విస్తుపోయింది.

తన పెళ్ళాం కాపరానికి రావంటున్నాదని 'ఆయన' కోర్టులో కేసెందుకు పెట్టకూడదూ? న్యాయస్థానమే 'ఆయన' తన మొగుడు కాడని తీర్పు చెబితే తనకీ అపనింద ఉండదు.- ఒకవేళ కోర్టువారే 'ఆయన' తన మొగుడే అని తీర్పు చెప్పేరా, మరీ మంచిదీ. న్యాయసమ్మతంగా తన కాపరం నిలబడుతుంది. ఇంతకీ వాళ్లు కోర్టుకి ఎక్కరెందు చేత?

ముప్ఫయ్యోపడిలో పడిన చెల్లాయ్యమ్మ ఎదురుచూస్తున్న మొగుడు రాలేదు. ఏలుకుంటానన్న మొగుణ్ని కాదంటున్నాది. ఇంకొన్నేళ్లుపోతే మొగుడొచ్చినా ఒకటే, రాకపోయినా ఒకటే. 'ఈడు' లేనప్పుడు 'వాడు' ఉండి ఏంలాభం? మొగుడు పరారై ఇరవైయ్యేళ్ళు కావొస్తున్నాది. వచ్చిన 'ఆయన' తన మొగుడు కానప్పుడు ఇంతవరకూ రాని మొగుడు ఇహ వస్తాడని మాత్రం నమ్మకం ఏమిటి?

ప్రపంచం పోకడ చాలామట్టుకు అర్థం చేసుకున్న చెల్లాయ్యమ్మ ఒక్కొక్కప్పుడు జీవితంలో గొప్ప తెలివితక్కువపని చేసినట్టు బాధపడుతుంది. చిక్కిన 'అవకాశాన్ని' జారవిడుచుకోవడంలో తను నిజంగా తెలివితక్కువగానే ప్రవర్తించుంటుంది. అత్యాచారాన్ని ప్రతిఘటించినందువల్ల పొందుకున్నది ఏమీ లేకపోయింది సరికదా పైపెచ్చు తనకే ఆ అత్యాచారాన్ని అంటగడుతున్నాది లోకం!

తన కర్తవ్యం ఏమిటి? బాల్యంలో పెళ్లయి కుర్రమొగుడు ఎటో పారిపోతే, పారిపోయిన మొగుడుకోసం జన్మంతమూ ఇలా పడి ఏడవ్వలసిందేనా? ఎంతకాలమని ఇలాగ మడికట్టుకూర్చోవడం? కూచున్నా లోకం దృష్టిలో తను కట్టుకున్నది మడిబట్టకాదు. అందరూ 'ఆయనే' తన మొగుడనీ, తనే 'ఆయన్ని' ఒదిలేసిందనీ ఆడిపోసుకుంటున్నారు!

తనమట్టుకు తనకి—'ఆయన' తన మొగుడు కచ్చితంగా కాడని నిర్ధారణ ఏమిటి? ఒక్క పుట్టుమచ్చ! ఇరవైయ్యేళ్లకిందట తను సరాగ్గా చూసింది పుట్టుమచ్చో, కాదో? ఒకవేళ కారణాంతరాలవల్ల ఈ దీర్ఘకాలంలో ఆ మచ్చ చెరిగిపోయుండకూడదూ? కొంపతీసి, తను అగ్నిసాక్షిగా పెళ్ళాడిన మొగుణ్ణే కాదంటున్నాదేమో!?...

పిండి విసురుతూ "నేనెవర్ని?" అని ప్రశ్నించుకున్న చెల్లాయమ్మ "నేను 'ఆయన'కి పెళ్ళాన్ని" అని ఇవాళ సమాధానం చెప్పుకుంది. ★





లల్లూరాం అండ్ కో
స్థాపితము 1928.
ఎన్నో సంవత్సరాలుగా మన్నికకు, నాణ్యతకు, సరసమైన ధరలకు ప్రసిద్ధిచెందిన
* ఇనుప పెట్టెలు * ఉక్కుబీరువాలు
* క్యాషు బాక్సులు
లల్లూరాం అండ్ కో
వెలగలేటివారి వీధి, :: విజయవాడ - 1.
"కొత్త షోరూమ్ - మారుతి సినిమా ఎదురుగా."